సాక్షి
అనంతపురం
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ధర పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.3°/21.1°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లో ఆగిన జల విద్యుత్ ఉత్పత్తి



పీఏబీఆర్‌లోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) వద్ద ఏర్పాటైన ఏపీ జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. డ్యాం నుంచి జల విద్యుత్ ఉత్పత్తికి నీటిని సరఫరా చేసే ప్రాంతంలోని గేట్ లింక్ దెబ్బతింది. దీంతో నీటిని విడుదల చేయడానికి గేట్ ఎత్తేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఈ నెల 5న జల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం నాటికి 3 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఏపీ జెన్ కో జేఈ కిరణ్ తెలిపారు. బుధ, గురువారాల్లో గేట్ లింక్‌కు మరమ్మతులు పూర్తి చేసేందుకు ఇరిగేషన్, జెన్‌కో సివిల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మరమ్మతులు పూర్తి కాగానే యథావిధిగా జల విద్యుత్‌ను ఒక టర్బైన్‌లో గంటకు 3 వేల చొప్పున రోజుకు సుమారు 72,500 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని జేఈ కిరణ్ తెలిపారు.

శిల్క్ సమగ్ర పథకానికి టెండర్లు

అనంతపురం అగ్రికల్చర్: శిల్క్ సమగ్ర–2 పథకానికి టెండర్లు ఆహ్వానించినట్లు పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారి ఐ.విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రొఫైలాక్టిక్ మెసర్స్ ఫర్ అస్యూర్డ్ కకూన్ ఈల్డ్' కింద రైతులకు నాణ్యమైన క్రిమిసంహారక మందులు అందజేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన డీలర్లు ఈ నెల 25న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ నెల 29న కలెక్టరేట్‌లో టెండర్లు ఫైనలైజ్ చేస్తామన్నారు. దరఖాస్తుదారులు ఈఎండీ రుసుం కింద రూ.62,500 డీడీ రూపంలో డీఎస్ఓ, పట్టు పరిశ్రమశాఖ పేరు మీద సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 86395 00606 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పట్టుచీరల వ్యాపారి ఖాతాలో నగదు మాయం



యాడికి: సైబర్ నేరగాళ్లు పట్టుచీరల వ్యాపారి బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసి దాదాపు రూ.4,22,215 మాయం చేశారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. యాడికి మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు పట్టుచీరల వ్యాపారి. ఈయనకు తాడిపత్రిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా ఉంది. ఈ క్రమంలో శ్రీనివాసులు అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు మంగళవారం హ్యాక్ చేశారు. మొదటి విడతగా రూ.3,50,000 డ్రా అయినట్లు వ్యాపారి సెల్ ఫోన్‌కు మెసేజీ వచ్చింది. అప్రమత్తమైన శ్రీనివాసులు వెంటనే బ్యాంకు సిబ్బందికి సమాచారాన్ని తెలిపేలోపు రూ.4,999 కట్ అయినట్లు మరో మెసేజీ వచ్చింది. ఇక మూడోసారి రూ.67,216 కట్ అయినట్లు మెసేజీ వచ్చింది. పిల్లల చదువుల కోసం దాచుకున్న డబ్బు సైబర్ నేరగాళ్లు కొట్టేయడంతో శ్రీనివాసులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేటి నుంచి కోర్టు విధుల బహిష్కరణ

అనంతపురం : రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనంతపురం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సాధారణ సభ్యుల అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. కర్నూలు పర్యటనకు వస్తున్న మోదీ రాయలసీమ ప్రజల ఆకాంక్ష అయిన హైకోర్టు ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జిల్లా కోర్టు విధులను బహిష్కరిస్తున్నామన్నారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానం చేశారు. రాజధాని ఆంధ్రా ప్రాంతంలో ఏర్పాటైతే.. హైకోర్టు సీమలో ఏర్పాటు చేయాలని, రాయలసీమలో రాజధాని ఏర్పాటైతే ఆంధ్రా ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని నాడు జరిగిన పెద్దమనుషుల ఒప్పందాన్ని అనంతపురం బార్ అసోసియేషన్ సెక్రెటరీ ఈ.వెంకట్రాముడు ఉటంకించారు. హైకోర్టు సీమ ప్రజల హక్కు అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర నాయకులు సూర్యచంద్ర యాదవ్ పేర్కొన్నారు.

సకాలంలో సరిపడా విత్తనం, ఎరువులు అందించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు రైతులను ఏడిపిస్తోంది. రబీ మొదలై 15 రోజులు కావొస్తున్నా విత్తన పప్పుశనగ ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబిస్తోంది. ఈ పాటికే విత్తన పంపిణీ పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పంపిణీ ప్రక్రియే ప్రారంభించకపోవడం గమనార్హం.

నిన్న యూరియా తిప్పలు.. నేడు విత్తన అవస్థలు



- రబీ సాగుకు విత్తనం ఇవ్వకుండా సర్కారు దాటవేత
- నేటి నుంచి పంట సాగుకు అదను

అనంతపురం అగ్రికల్చర్: రబీ సీజన్ పంటల సాగుకు మంచి అదను బుధవారం ప్రారంభమవుతుంది. నవంబర్ 15 వరకు పంట వేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో 65 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పంట సాగులోకి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. కానీ రాయితీ విత్తనం ఎప్పుడిస్తారనే విషయం మాత్రం కూటమి సర్కారు తేల్చడం లేదు. వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ఈ విషయంపై నోరు విప్పడం లేదు. దీంతో పప్పుశనగ రైతులు విత్తనం కోసం ఎదురుచూస్తూ అదను మీరుతుందనే ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలుగా యూరియా కోసం తిప్పలు పడుతున్న రైతులు నేడు విత్తనం కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి కల్పించారు.

ఇదే తొలిసారి..

రాయితీ విత్తనం ఇవ్వకుండా జాప్యం చేస్తుండటం జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. రబీ సన్నాహకాలు ఎంత ఆలస్యమైనా అక్టోబర్ 10లోపు పంపిణీ మొదలు పెడతారు. 15 రోజుల క్రితమే కేటాయింపులు, ధరలు ప్రకటించినా, వాటికి కూడా కొర్రీలు వేశారు. 28 వేల క్వింటాళ్ల నుంచి 14 వేల క్వింటాళ్లకు కుదింపు చేశారు. రాయితీ కూడా 40 శాతం నుంచి 25 శాతానికి తగ్గించేసి జిల్లా రైతులపై రూ.కోట్ల మేర భారం మోపారు. అన్నింటికీ సిద్ధంగా ఉన్నా కూడా విత్తనం ఇవ్వకుండా నాన్చుడి ధోరణి అవలంబిస్తుండటం రైతులకు ఇబ్బందిగా మారింది.

కరోనాలోనూ ఇబ్బంది లేకుండా..

రాష్ట్ర కేబినెట్‌లో కీలక మంత్రిగా పయ్యావుల కేశవ్ చెలామణి అవుతున్నారు. 14 మంది ఎమ్మెల్యేలు, ఇరువురు పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు అధికార పార్టీకి చెందిన వారే అయినా అదనులో పప్పుశనగ అందించకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని రైతులు గుర్తు చేస్తున్నారు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా 2020, 2021లో రెండేళ్లూ ఖరీఫ్, రబీలో రైతులు ఇబ్బంది పడకుండా సకాలంలో 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, పప్పుశనగ ఇతరత్రా విత్తనాలు, అవసరమైన ఎరువులు సాఫీగా అందించారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. యోగాంధ్ర, సూపర్‌సిక్స్, సూపర్‌హిట్, డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు, జీఎస్టీ తగ్గింపు అంశంపై రూ.కోట్లు ఖర్చు చేసి ప్రచార ఆర్భాటం చేస్తున్న చంద్రబాబు సర్కారు ఎరువులు, విత్తనం ఇవ్వడంలో మాత్రం చిన్నచూపు చూస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఐద్వా జాతీయ కార్యదర్శి ధావలే

అనంతపురం అర్బన్: చట్టాల అమలు, హక్కుల సాధనకు ఉద్యమించాలని మహిళలకు ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. అనంతపురంలో నిర్వహించిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలకు రెండవ రోజు మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద విధానాలను అవలంబిస్తూ మనువాదం అమలుకు ప్రయత్నిస్తూ మహిళల హక్కులను హరించేందుకు సిద్ధమవుతోందన్నారు. వ్యవసాయంలో మహిళల పాత్ర క్రియాశీలకమన్నారు. ప్రధానంగా పాడిరంగంపై ఆధారపడిన మహిళలు అధికంగా ఉన్నారన్నారు. పాడి పరిశ్రమను దెబ్బతీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దళితులు, మహిళలపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకురాళ్లు రమాదేవి, హేమలత, రాణి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిస్తి మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతమ్మ, కోశాధికారి సావిత్రి పాల్గొన్నారు.

తప్పుమీద తప్పు చేస్తున్న ప్రభుత్వం

- నకిలీ మద్యంపై ఎంపీ మిథున్‌రెడ్డి సీబీఐ విచారణ అడిగిన గంటల్లోనే 'సిట్' ఏర్పాటు
- సీబీఐ విచారణ కోరతామని చంద్రబాబు చెబితే హుందాగా ఉండేది
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: 'రాష్ట్రంలో బయట పడిన నకిలీ మద్యపు డంపులు, ఫ్యాక్టరీల వ్యవహారం రాష్ట్ర ప్రతిష్టను దేశ వ్యాప్తంగా బజారుపాలు చేసింది. ఈ వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం తప్పుమీద తప్పు చేస్తోంది' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐ విచారణ కోరుతున్నామని చంద్రబాబు చెబితే హుందాగా ఉండేదన్నారు. సీబీఐ విచారణ జరపాలని ఎంపీ మిథున్‌రెడ్డి కోరిన గంటల వ్యవధిలోనే చంద్రబాబు సిట్ ఏర్పాటు చేశారన్నారు. నకిలీ మద్యం కుంభకోణం వెనుక రాష్ట్ర పెద్దల హస్తం ఉందని ప్రజలు నమ్ముతుండడంతో దిగజారుతున్న ప్రభుత్వ పరువును నిలబెట్టుకునే క్రమంలో ప్రతిపక్షంపై బురదజల్లేందుకు ముద్దాయి మాట్లాడినట్లు ఒక వీడియో విడుదల చేశారన్నారు. మరోవైపు ప్రజల దృష్టి మళ్లించేందుకే జోగి రమేష్ మీద అభాండాలు, మిథున్‌రెడ్డి కంపెనీల్లో 'సిట్' సోదాలతో హడావుడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ బేవరేజస్ కంపెనీల నుంచి కాకుండా ప్రైవేట్‌గా నకిలీ మద్యం అమ్మకాలతో రూ.15 వేల కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు.

అతిపెద్ద భూ కబ్జా కనిపించలేదా?

రాష్ట్రంలో ఎన్నడూ చూడని భూకబ్జా అనంతపురం నగర శివారులోని పాపంపేట పొలంలో చేస్తున్నారన్నారు. 930 ఎకరాల శోత్రియం భూముల్లో నివాసం ఉంటున్న 15 వేల కుటుంబాల ఇళ్లు, స్థలాలను కచ్చా భూములుగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుంటూ పాగా వేయాలని చూస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, టీడీపీ, సీఎంఓ, ఇంటెలిజెన్స్ వర్గాలు ఎందుకు స్పందించలేదన్నారు.

కందికుంట ప్రసాద్‌కు బాధ ఎందుకో..?

రూ.కోట్లు విలువైన భూములు కబ్జా చేస్తున్న పరిటాల సునీత బంధువుల వ్యవహారంపై విమర్శిస్తే కందికుంట ప్రసాద్‌కు ఎక్కడ బాధ అయ్యిందో అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. పరిటాల సునీత రాసిన లేఖ వల్ల 50 వేల ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయింది వాస్తవమో కాదో మంత్రి పార్థసారథిని అడిగి తెలుసుకోవాలన్నారు. ధర్మవరంలో నేసేవారితో రూ.కోట్లు వసూళ్లు చేసింది పరిటాల శ్రీరామో కాదో మీ కుల పెద్దలను అడిగినా, మంత్రి సత్యకుమార్‌ను అడిగినా చెప్తారన్నారు. వ్యక్తిగతంగా విమర్శలు చేసుకోవడానికి మీకు, నాకు పొలం గట్ల తగదాలేవీ లేవన్నారు. 'రూ.3 కోట్ల కారు అనేది పెద్ద విషయమా? ఏడుసార్లు గెలిచిన కుటుంబం వారి ట్రాక్ రికార్డు. రూ.150 కోట్లతో ఇల్లు కట్టుకోకూడదా? రూ. 15 కోట్లు విలువ చేసే కార్లు ఉండకూడదా? రూ.1000 కోట్ల ఆస్తులు వారు సంపాదించుకోకూడదా?' అంటూ కందికుంట వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నారన్నారు. హంద్రీ–నీవా కాలువ లైనింగ్ ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు కిందకు ఇంకవని, లక్షల ఎకరాల భూములు బీళ్లుగా మారతాయని అన్ని రాజకీయ పార్టీలు గగ్గోలు పెడితే ఏమి చేశావు కందికుంట ప్రసాద్ అని నిలదీశారు.

నీ అంత ట్రాక్ రికార్డు మాకు లేదు

కందికుంట ప్రసాద్ అంత ట్రాక్ రికార్డు తమకు లేదని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. 'డీడీల స్కాం కేసులో సీబీఐ నీపై విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో అప్పీలు ఫైలైంది. ఇప్పుడు కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ కేసులో నువ్వు జైలుకు పోకుండా చూసుకో. ఇదీ నీ ట్రాక్ రికార్డు' అని అన్నారు. 'ఇక నా ట్రాక్ రికార్డ్ గురించి చెప్పాలంటే... నేను రాజకీయాల్లోకి రాకముందే సిద్ధరాంపురంలో మా కార్యకర్తలకు మేము సొంతంగా డబ్బులిచ్చి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాం. 2013లో దాదాపు ఐదారు వేల మందికి 'దీపం' ధరతోనే గ్యాస్ కనెక్షన్లు ఇప్పించాను. వేలాది మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించి, గొర్రెలు, బర్రెలు ఇచ్చాం. అధికారంలోకి రాగానే ఎంతైనా సంపాదించుకోవచ్చనే నీ విధానానికి మేము చాలా దూరంగా ఉన్నాం. కోవిడ్ సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి ఇచ్చాం. సహాయక చర్యల కోసం రూ.కోట్లు ఖర్చు చేశాం. పేరూరు డ్యాంకు హంద్రీ–నీవా నీళ్లు తెప్పించాం' అని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి, మద్దెలచెరువు సుధీర్‌రెడ్డి, లింగారెడ్డి, బండి పవన్, ఈశ్వరయ్య, నీరుగంటి నారాయణరెడ్డి, మీనుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందక విలవిల

- నిలిచిన ఎన్టీఆర్ వైద్య సేవలు
- జీజీహెచ్, సూపర్‌స్పెషాలిటీకి రోగుల క్యూ
- ప్రజల ఆరోగ్యంపై పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి సర్కారు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అనంతపురం మెడికల్: ప్రజల ఆరోగ్యం కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. సకాలంలో ఎన్టీఆర్ వైద్య సేవలందక రోగులు విలవిలలాడుతున్నారు. బకాయిలు పేరుకుపోయాయని నెట్‌వర్క్ ఆస్పత్రులు గుండె, కిడ్నీ, కేన్సర్ తదితర ప్రాణాంతక సమస్యలున్న కేసులను చూడకుండా తిరస్కరిస్తుండటంతో రోగులు తిరిగి ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు వస్తున్నారు. అధిక సంఖ్యలో రోగులు వస్తుండటంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రాణాలు కాపాడుకునేందుకు పలువురు అప్పోసప్పో చేసి ప్రైవేట్‌గా వైద్యం చేయించుకుంటున్నారు.

వైద్యమందక.. ప్రత్యక్ష నరకం

- కదిరికి చెందిన 59 ఏళ్ల వ్యక్తికి ఇటీవల గుండె నొప్పి వచ్చింది. హుటాహుటిన అనంతపురం సాయినగర్‌లోని ఓ కార్డియాక్ ఆస్పత్రికి వచ్చారు. అందులో వైద్యులు పరీక్షించి 'యాంజియో' చేయాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్స చేయడం లేదని చెప్పడంతో.. రూ.18,000 వెచ్చించి సర్జరీ చేసుకోవాల్సి వచ్చింది.
- అనంతపురానికి చెందిన ఓ 60 ఏళ్ల వృద్ధురాలు జారిపడి కాలు విరిగింది. ఆమెకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. కుటుంబీకులు నెట్‌వర్క్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ 'ఎన్టీఆర్ వైద్య సేవ' లేదని చెప్పారు. దీంతో వృద్ధురాలు పని చేస్తున్న ఇంటి యజమాని ఆమెకు రూ.35,000 వెచ్చించి ఆపరేషన్ చేయించారు.
- గాండ్లపర్తికి చెందిన యువశ్రీ అనే గర్భిణి మూడవ ప్రసవం కోసం అనంతపురంలోని సాయినగర్‌లో ఉన్న ఓ ఆస్పత్రికి వెళ్లింది. కాగా అక్కడ ఎన్టీఆర్ వైద్య సేవ కింద డెలివరీ చేయలేం అని చెప్పడంతో.. చేసేదిలేక ఆమెను సర్వజనాస్పత్రిలో చేర్చారు.
- జిల్లాలోని వివిధ కార్పొరేట్ ఆస్పత్రుల్లో కార్డియాక్, నెఫ్రాలజీ సేవలను తిరస్కరించడంతో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కేసులు అధికమయ్యాయి. సూపర్ స్పెషాలిటీలోని క్యాథ్‌ల్యాబ్‌లో ఉన్న 30 పడకలు నిండిపోయాయి. కేసులు పెరిగితే పరిస్థితేంటని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. జీజీహెచ్ నుంచి కేసులను రెఫర్ చేయవద్దంటూ చెబుతున్నారు. అదేవిధంగా డయాలసిస్ రోగుల పరిస్థితి అదే విధంగా ఉంది. రోజూ 70 నుంచి వంద మంది వరకు రోగులకు డయాలసిస్ చేయాల్సి ఉంది. కాగా వీరంతా సూపర్ స్పెషాలిటీ, సర్వజనాస్పత్రిలోని డయాలసిస్ యూనిట్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

5 ప్రీ ఆథరైజేషన్లు మాత్రమే..

జిల్లాలోని 46 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మంగళవారం 5 ప్రీ ఆథరైజేషన్లు మాత్రమే జరిగాయి. సాధారణంగా రోజూ 100 నుంచి 200 వరకు ప్రీ ఆథరైజేషన్లు జరిగేవి. అటువంటిది తక్కువ స్థాయికి పడిపోయాయంటే నెట్‌వర్క్ ఆస్పత్రుల నిరసన ఏ స్థాయికి చేరుకుందో తెలుస్తుంది.

మాటల్లోనే ఘనాపాటి.. అభివృద్ధి అధోగతి

- నగరంలో రోడ్లన్నీ గుంతలమయమే
- నాసిరకం ప్యాచ్ వర్క్‌లతో తేలిన కంకర
- ముందుకు సాగని నారాయణపురం వంతెన నిర్మాణం
- కలగా మిగిలిన రాజీవ్ కాలనీ రహదారి నిర్మాణం



- అనంతపురంలోని ప్రధానమైన కూడళ్లలో సప్తగిరి సర్కిల్ ఒకటి. ఇక్కడ రోడ్డుపై ఏర్పడిన గుంతలను కూటమి ప్రభుత్వం హడావుడిగా 'ప్యాచ్ వర్క్'లో భాగంగా మరమ్మతు పనులు చేయించింది. పనులు చేయించిన కాంట్రాక్టర్ డబ్బు మిగుల్చుకోవడానికి నాసిరకంగా చేపట్టడంతో కొద్ది రోజులకే కంకర తేలిపోయింది. వాహనదారులకు మాత్రం ఇబ్బందులు తప్పలేదు.



- ఇది విద్యుత్ నగర్‌కు వెళ్లే మార్గం. ఇక్కడ రోడ్డు కంకర తేలి ఉంది. వాహనాలు వెళ్లే సమయంలో కంకర రాళ్లు టైర్ల కిందపడి సమీపంలోని వారిపైకి దూసుకొస్తున్నాయి. కొందరు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇవేమీ పాలకుల కంటికి కనిపించడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు.

అనంతపురం క్రైం: ఆయన మాటల్లోనే ఘనాపాటి.. చేతల్లో మాత్రం కాదు. ఆర్భాటంగా ప్రకటనలు చేయడమే కానీ ఆచరణలో చేసిందేమీ ఉండడం లేదు. కోటలు దాటుతున్న మాటలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇదీ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆశించినస్థాయిలో జరగడం లేదు. తాము అధికారంలోకి వస్తే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ అమలులో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విఫలమయ్యారు. కనీవినీ ఎరుగని రీతిలో రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రకటించారు. మరి ఎక్కడ పనులు చేపట్టారో తెలియని పరిస్థితి. నగరం నలుమూలలా సరైన రోడ్లు లేవు. గుంతలు పడిన, కంకర తేలిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎ.నారాయణపురం బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతూనే ఉంది. రాజీవ్‌కాలనీ రహదారి నిర్మాణం అధ్వానంగా ఉంది. రోడ్డు నిర్మాణం కలగానే మిగిలిపోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. అనంతపురం వేదికగా జరిగిన 'సూపర్ సిక్స్' సభ సందర్భంగా రూ.లక్షలు వెచ్చించి సప్తగిరి సర్కిల్‌లో రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు చేశారు. అయితే నాసిరకంగా చేపట్టడంతో ప్యాచ్‌వర్క్ కాస్తా తేలిపోయింది. వర్షాలు వచ్చినపుడు గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు అసౌకర్యంగా మారుతోంది. గుంతల్లో అదుపుతప్పి పలువురు ప్రమాదాలకు గురైన సందర్భాలూ ఉన్నాయి.

అడుగు అడుగేయలేం



నగరంలో రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లపై పెద్ద ఎత్తున నీరుపారుతోంది. అడుగు వేయలేని పరిస్థితి. ప్రధానంగా సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, తాడిపత్రి బస్టాండ్, అరవిందనగర్, వేణుగోపాల్ నగర్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, బళ్లారి బైపాస్ ఇలా చాలా కూడళ్లు, కాలనీలకు వెళ్లే రోడ్లు గుంతలు పడ్డాయి. కొన్ని కాలనీల్లో నడవడానికి కూడా అనువుగా లేవు. రోడ్ల మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మహేష్, చిరువ్యాపారి, అనంతపురం

గుంతలు పూడ్చండి



అనంతపురంలో ద్విచక్ర వాహనం నడపాలంటే నరకమే. సప్తగిరి సర్కిల్ నుంచి సాయినగర్, రుద్రంపేట రోడ్డు, అరవిందనగర్, నాయక్ నగర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. గుంతలైనా పూడ్చి పుణ్యం కట్టుకోవాలని నగరవాసులు కోరుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు ఆ దిశగా దృష్టి సారించాలి.

– లక్ష్మణ్, సున్నంగేరి

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అభివృద్ధి పరుగులు

గత వైఎస్సార్‌సీపీ హయాం (2019–2024)లో అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి పరుగులు పెట్టింది. నగరం అభివృద్ధి కోసం రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేసి రహదారుల రూపురేఖలు మార్చేశారు. మురుగు కాల్వలు, శివారు ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టారు. రూ.375 కోట్లతో బళ్లారి బైపాస్ రోడ్డు నుంచి రాప్తాడు పంగల్ రోడ్డు దాకా రహదారి నిర్మాణం జరిగింది. క్లాక్ టవర్ – పీటీసీ వరకు ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్ నగరానికే వన్నె తెచ్చిందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

పంటల బీమా అవకతవకలపై సమగ్ర విచారణకు ఆదేశం

- విచారణాధికారిగా విజయలక్ష్మి, ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్– 2021లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఉచిత పంటల బీమా కింద మంజూరైన పరిహారం పంపిణీలో అవతవకలు చోటు చేసుకున్నాయి. సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యల కింద చార్జెస్ ఫ్రేమ్ చేసి సమగ్ర విచారణ చేయాల్సిందిగా విచారణాధికారిగా అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా జేడీఏ ఉమామహేశ్వరమ్మను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉరవకొండ డివిజన్, విడపనకల్లు మండలం డొనేకల్లులో ఖరీఫ్– 2021లో పంటల బీమా క్లెయిమ్స్‌లో అవతవకలను గుర్తించినట్లు తెలిపారు. పత్తి, మిరప పంటలకు సంబంధించి ఇష్టారాజ్యంగా ఈ–క్రాప్ చేయడంతో అనర్హులకు బీమా పరిహారం మంజూరైందని, మరికొందరు అర్హులకు పరిహారం మంజూరు కాలేదని పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో రూ.10,39,085 అనర్హులకు పరిహారం జమ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి బాధ్యులుగా అప్పటి జాయింట్ డైరెక్టర్ (జేడీఏ) బి.చంద్రానాయక్ (ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లా జేడీఏ), అలాగే ఉరవకొండ డివిజన్ ఏడీఏ ఎస్.పద్మజ (ప్రస్తుతం రాయదుర్గం ఏడీఏ), విడపనకల్లు అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏఓ) ఆర్.మధుమతి (ప్రస్తుతం సెలవులో), అప్పటి డొనేకల్లు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) కె.విజయభాస్కర్ (ప్రస్తుతం గుమ్మఘట్ట మండలం కలుగోడు–1)లపై చార్జెస్‌ఫ్రేమ్ చేసి చట్ట ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- జెడ్పీ జీఈఓ శివశంకర్



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

గుమ్మఘట్ట: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీ సీఈఓ శివశంకర్ అన్నారు. గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో ఎంపీడీఓ జయరాములుతో కలిసి ఆయన పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీలో పదోన్నతుల కార్యాచరణ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 మందికి అవకాశం

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా పరిషత్ పరిధిలోని ఉమ్మడి జిల్లా ఉద్యోగులకు పదోన్నతులు దక్కనున్నాయి. ఇందుకు సంబంధించిన కార్యాచరణను చేపట్టినట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,019 మందికి లబ్ధి చేకూరనుండగా ఇందులో ఉమ్మడి జిల్లాలో 65 మంది ఉండడం గమనార్హం. పది వేల జనాభా కలిగిన ప్రతి పంచాయతీకి డిప్యూటీ ఎంపీడీఓను నియమించనున్నారు. దీంతో ఇకపై ఈఓఆర్డీలను డిప్యూటీ ఎంపీడీఓలుగా పిలువనున్నారు. పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు ఈ నెల 20 తేదీలోపు అధికారికంగా వెలువడనున్నట్లు తెలిసింది. త్వరలో కింది స్థాయి ఉద్యోగులకూ పదోన్నతులు కల్పించనున్నట్లు సమాచారం.

వ్యక్తి దుర్మరణం

శింగనమల: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన సూర్యనాగశేఖర్(52) మంగళవారం అనంతపురానికి వెళ్లి అక్కడ పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. శింగనమల మండలం నాయనపల్లిక్రాస్‌లో టీ తాగిన అనంతరం 544–డీ జాతీయ రహదారిపైకి చేరుకునేందుకు యూటర్న్ తీసుకుంటుండగా తాడిపత్రి నుంచి బెంగుళూరుకు వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన సూర్యనాగశేఖర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

లారీ పరిశ్రమ కుదేలు

- వ్యాట్‌ను తగ్గింపుపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- నాలుగు రాష్ట్రాల్లో కంటే ఏపీలో డీజిల్‌పై వ్యాట్ అధికం
- తీవ్రంగా నష్టపోతున్న లారీ యజమానులు
- సరిహద్దు రాష్ట్రాల్లో డీజిల్ కొట్టిస్తున్న వైనం



తాడిపత్రి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ రూపంలో డీజిల్‌పై అదనపు పన్ను వసూలు చేస్తుండడంతో లారీ పరిశ్రమ కుదేలవుతోంది. దేశంలోని పలు రాష్ట్రాలు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గించాయి. ఇంత కాలం రికార్డు ధరలతో తీవ్రంగా నష్టపోయిన వినియోగదారులకు ఈ నెలలో కేంద్రం అందించిన ఉపశమనంతో పాటు దాదాపు 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పెట్రోల్, డీజిల్‌పై రూ. 2 నుంచి రూ.7 వరకు వ్యాట్ తగ్గించాయి. అయితే ఏపీలోని కూటమి ప్రభుత్వం మాత్రం ఆ దిశగా కనీస ఆలోచన చేయడం లేదు. ఫలితంగా లారీ యజమానులు వ్యాట్ రూపంలో తీవ్ర నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది.

3 వేల లారీలపై ప్రభావం

తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో భారీ పరిశ్రమలైన అర్జాస్ స్టీల్‌ప్లాంట్, అదానీ పెన్నా.. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు, సోలార్, విండ్ మిల్స్, వందలాది గ్రానైట్, కడపస్లాబ్ యూనిట్లతో పాటు చిన్న, మధ్యతర పరిశ్రమల వల్ల వేలాది లారీలకు నిత్యం బాడుగలు ఉంటాయి. ఒక్క తాడిపత్రి ప్రాంతంలోనే లారీ పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఉపాధి కలుగుతోంది. తాడిపత్రి నుంచి రోజూ ఏపీలోని వివిధ జిల్లాలతో పాటు దేశ వ్యాప్తంగా పలు నగరాలకు పలు రకాల ముడిసరుకును లారీల ద్వారా రవాణా చేస్తుంటారు. అక్కడి నుంచి కూడా సరుకులు జిల్లాకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో అయితే దేశంలోని మిగిలిన ప్రాంతాల కంటే రాష్ట్రంలో డీజిల్‌పై వ్యాట్ పన్ను అధికంగా ఉండడంతో తాడిపత్రి ప్రాంతంలోని 3వేల లారీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

పొరుగు రాష్ట్రాలకు ఆదాయం

ఏపీకి సరిహద్దులోని మూడు రాష్ట్రాల్లో డీజిల్ ధర రూ.5 నుంచి రూ.7 వరకు తక్కువగా ఉంది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు డీజిల్‌పై వ్యాట్ శాతాన్ని తగ్గించడమే ఇందుకు కారణం. అయితే ఏపీలో మాత్రం డీజిల్‌పై వ్యాట్ శాతాన్ని కూటమి ప్రభుత్వం తగ్గించకపోవడంతో జిల్లాలోని లారీ యజమానులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. దీంతో ఆర్థిక భారం నుంచి బయటపడేందుకు సరిహద్దు రాష్ట్రాలపై ఆధారపడుతున్నారు. సరుకు రవాణాలో భాగంగా సరిహద్దు రాష్ట్రాలకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ట్యాంక్‌లను ఫుల్ చేయించుకుని వస్తున్నారు. ఫలితంగా ఒక్కసారి ట్యాంక్ ఫుల్ చేయిస్తే రూ.4 వేలకు పైగా మిగులుతోందని లారీ డ్రైవర్లు చెబుతున్నారు.

రాష్ట్రాల్లో డీజిల్ ధరలు ఇలా..

రాష్ట్రం	డీజిల్ సగటు ధర (లీటరు)
ఏపీ	రూ.97.49
మహారాష్ట్ర	రూ.90.68
కర్ణాటక	రూ.91.45
తమిళనాడు	రూ.92.43

లారీ యజమానులను ఆదుకోవాలి



మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో డీజిల్‌పై వ్యాట్ అధికంగా ఉంటోంది. ఇది కరువు ప్రాంతమైన తాడిపత్రిలో లారీ పరిశ్రమ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఇప్పటికే లారీలకు బాడుగలు లేవు. ఉన్న అరకొర బాడుగలకు పోటీ ఉంటోంది. 2012లో ఉన్న బాడుగలు దాదాపు ఇప్పటికీ అవే కొనసాగుతున్నాయి. అప్పట్లో లీటరు డీజిల్ రూ.52 ఉండగా ప్రస్తుతం రూ.97కు పైగా చేరింది. డీజిల్ ధర రెండింతలు పెరిగిన బాడుగలు పెరగకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ఫైనాన్స్ కంతులు కట్టుకోలేక లారీ యజమానులు ఆర్థికంగా చితికిపోతున్నారు. చివరకు ఉన్న లారీలనూ అమ్ముకోవాల్సి వస్తోంది. డీజిల్‌పై వ్యాట్ పన్నును తగ్గిస్తే లారీ యజమానులకు ఎంతో కొంత మేలు జరుగుతుంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బీకే నదీముద్దీన్, తాడిపత్రి లారీ అసోసియేషన్ కార్యదర్శి

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో లీటరు డీజిల్ సగటు ధరలు ఇలా..

అనంతపురం	రూ.97.49
బాపట్ల	రూ.97.71
చిత్తూరు	రూ.98.22
ఏలూరు	రూ.97.66
గుంటూరు	రూ.97.57
కాకినాడ	రూ.96.71
కృష్ణా	రూ.97.79
కర్నూలు	రూ.97.72
నెల్లూరు	రూ.97.85
కడప	రూ.97.09
తూర్పుగోదావరి	రూ.97.24

గుంతకల్లు ఆస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ విచారణ



వైద్యులతో సమావేశమైన డేవిడ్ సెల్వరాజన్

గుంతకల్లు టౌన్: నాలుగు రోజుల క్రితం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుడిపై రోగి, సహాయకులు దాడికి యత్నించి, స్టాఫ్‌నర్సులను దూషించిన ఘటనపై ఇన్‌ఛార్జ్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజన్ విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆస్పత్రికి విచ్చేసిన ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డితో పాటు ఘటన జరిగిన సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యుడు సల్మాన్ జావేద్, స్టాఫ్‌నర్సులు, సెక్యూరిటీ గార్డులను పిలిచి ఘటనకు దారి తీసిన కారణాలను విచారించారు. నిందితుల వివరాలు, పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు, వారిపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు డీసీహెచ్‌ఎస్ తెలిపారు. అలాగే ఆస్పత్రులు రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, ప్రతిరోజూ ఔట్‌పేషెంట్లు, సాధారణ కాన్పులు, తదితర విషయాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.

మూగజీవాలపై చిరుతల దాడి

కుందుర్పి: మండలంలోని కర్ణాటక సరిహద్దున ఉన్న కొత్తపల్లి గ్రామ సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై మంగళవారం మధ్యాహ్నం చిరుతలు దాడి చేసి చంపేశాయి. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని చిరుత దాడుల్లో మృతి చెందిన మూగజీవాలకు పరిహారం అందించాలని బాధిత రైతులు మారెన్న, పెద్ద రామప్ప, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

రైతు కష్టాలు పట్టని అసమర్థ ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ రైతువిభాగం నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు

ఉరవకొండ: ప్రత్యామ్నాయ పంటల సాగు కింద సబ్సిడీతో పప్పుశనగ విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రైతువిభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మేకలసిద్దార్థ్, రూరల్ సమన్వయకర్త రాయంపల్లి ఎర్రిస్వామిరెడ్డి మాట్లాడారు. రబీ సీజన్ కింద జిల్లాలో పప్పుశనగను ఉరవకొండ అత్యధికంగా 40 వేల హెక్టార్లలో పప్పుశనగను రైతులు సాగు చేస్తుంటారన్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకూ రైతులకు రాయితీతో పప్పుశనగ విత్తనం పంపిణీ చేయలేదన్నారు. కీలకమైన ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న నియోజకవర్గ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు రైతుల కష్టాలు పట్టడం లేదన్నారు. రాయితీ విత్తన పంపిణీపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరతో విత్తనాలను కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. జిల్లాలో గత ఖరీఫ్, రబీతో పాటు ప్రస్తుత ఏడాది ఖరీఫ్, రబీకు సంబంధించి విత్తన ఏజెన్సీలకు రూ.74 కోట్ల బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని, ఫలితంగా విత్తనం అందక పోవడంతో రైతులపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్థిక శాఖ మంత్రి కేశవ్ చొరవ తీసుకుని విత్తన కంపెనీలకు బకాయిలు చెల్లించి, సకాలంలో రైతులకు విత్తనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బసవరాజు, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, సుద్దాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

అనంతపురం సెంట్రల్: ప్రధానమంత్రి ఉపకార వేతన పథకం కింద ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికుల పిల్లలకు 2025–26 విద్యా సంవత్సరానికిగాను స్కాలర్‌షిప్పులను అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వృత్తి విద్యా, డిగ్రీ (మొదటి సంవత్సరం), ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంసీఏ, బీటెక్ తదితర కోర్సులు చదువుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ సైనికులు, సైనిక వితంతువులు, వీరనారీమణుల పిల్లలు డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 08554–241146లో సంప్రదించవచ్చు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

గుంతకల్లు: రౌడీషీటర్ కమ్మ ఆనంద్‌ను హత్య చేసిన సలీమ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గుంతకల్లు సీఐ మనోహర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. కమ్మ ఆనంద్, సలీమ్ ఇద్దరు మంచి స్నేహితులు. రోజూ కలిసి మద్యం సేవించేవారు. మద్యం మత్తులో సలీమ్ కుటుంబసభ్యుల గురించి ఆనంద్ అనుచితంగా మాట్లాడేవాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మద్యం సేవించిన వారు బస్టాండ్ ఏరియాలోని వీఎంఆర్ పార్కింగ్ వద్దకు చేరుకున్న అనంతరం సలీమ్ కుటుంబసభ్యులపై ఆనంద్ నోరుపారేసుకున్నాడు. దీంతో మాటామాటా పెరిగి సలీమ్ ఆవేశం పట్టలేక ఆనంద్ ముఖంపై చేతితో గుద్ది కిందకు పడేసి అక్కడే ఉన్న రాయితో ఆనంద్ తలపై మోది హతమార్చాడు. ఆనంద్ పిన్నమ్మ రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు హనుమన్ సర్కిల్ రైల్వేస్టేషన్ వద్ద తచ్చాడుతున్న సలీమ్‌ను మంగళవారం గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఆంధ్ర, ఢిల్లీ మ్యాచ్‌కు సర్వం సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: అండర్ –23 సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, ఢిల్లీ జట్ల మధ్య జరిగే టెస్ట్ మ్యాచ్‌కు ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఏర్పాటు పూర్తి చేశారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇది వరకే ఆంధ్ర జట్టు జిల్లాకు చేరుకోగా..ఢిల్లీ జట్టు మంగళవారం స్పోర్ట్స్ సెంటర్‌కు చేరుకుంది. ఉదయం, సాయంత్రం ఇరు జట్లు నెట్స్‌లో ముమ్మర సాధన చేశాయి. మ్యాచ్ కోసం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసినట్లు కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో నివాసముంటున్న లక్ష్మీదేవి(69) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తమకున్న 4.50 ఎకరాల్లో చీనీ సాగుకు, బోర్ల తవ్వకానికి ఇతరుల వద్ద చేసిన రూ.10 లక్షల అప్పు తీర్చే మార్గం కానరాక మదనపడుతూ అనారోగ్యానికి గురైన ఆమె... జీవితంపై విరక్తితో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

పుట్లూరు: మండల పరిధిలోని ఎ.కొండాపురం వద్ద ఈ నెల 11న చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్ బాషా (53) మంగళవారం మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీ కొనడంతో డ్రైవర్ మహబూబ్‌బాషా తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బస్సు కండక్టర్ రాధాకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్లూరు పోలీసులు తెలిపారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు

కుందుర్పి: మండల కేంద్రంలోని పలు మందుల దుకాణాల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి మంగళవారం తనిఖీలు చేపట్టారు. మలయనూరు, జంబుగుంపల, మహంతపురం, ఎనుములదొడ్డి, ఎర్రగుంట, నిజవల్లి తదితర పంచాయతీల్లో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రజల ఫిర్యాదుల మేరకే తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

ఉద్యాన అభివృద్ధికి కేంద్రం సహకారం

- వర్క్‌షాపులో రాష్ట్ర ఉద్యానశాఖ కన్సల్టెంట్ విద్యాశంకర్



మాట్లాడుతున్న విద్యాశంకర్

అనంతపురం అగ్రికల్చర్: క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) కింద ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నేషనల్ హార్టికల్చర్ బోర్డు (ఎన్‌హెచ్‌బీ) సహకారం అందిస్తోందని ఉద్యానశాఖ సీడీపీ రాష్ట్ర కన్సల్టెంట్ విద్యాశంకర్ తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉమ్మడి జిల్లాల ఉద్యానశాఖ అధికారులు డి.ఉమాదేవి, జి.చంద్రశేఖర్‌తో కలిసి అధికారులు, రైతులు, ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు వర్క్‌షాపు నిర్వహించారు. విద్యాశంకర్ మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటికే అరటి పంటను క్లస్టర్ కింద ఎంపిక చేసి ఎస్‌కే సంస్థ, ఫ్రెష్‌కార్టు సంస్థలకు సీడీపీ పథకం అమలుకు ప్రాథమికంగా అనుమతులు ఇచ్చామన్నారు. జిల్లా పరిధిలో కనీసం రూ.100 కోట్లు విలువ చేసే పంటను ఎంపిక చేసుకుని ముందుకు వచ్చే సంస్థలు, ఎఫ్‌పీఓలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. 20 శాతం వాటా భరిస్తే... 20 శాతం బ్యాంకు రుణం, 20 శాతం సభ్యులైన రైతుల వాటా, మిగిలిన 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంటు రూపంలో అందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో దానిమ్మ, చీనీ, అరటి, టమాట, మిరప, కర్బూజా, కళింగర పంటలకు సీడీపీ కింద తీసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. విత్తనం, మొక్కలు, ఎగుమతులు, కల్టివేషన్, పోస్ట్ హార్వెస్టింగ్, బ్రాండింగ్, లాజిస్టిక్స్ అంశాలపై ఏదైన ఒక పంటను ఎంపిక చేసుకున్న సంస్థ తమ దగ్గరున్న వనరులు, మౌలిక సదుపాయాలతో కూడిన ప్రాజెక్టు రిపోర్టు అందిస్తే అనుమతులు జారీ చేస్తామన్నారు. దీని వల్ల ఎఫ్‌పీఓలు, సంస్థలు ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో పాటు రైతులకు మెరుగైన లాభాలు ఉంటాయన్నారు. నాణ్యమైన పంట పండించడంతో పాటు బ్రాండింగ్ ద్వారా మార్కెటింగ్ పరిస్థితి మెరుగై ఎగుమతుల ద్వారా ఉద్యాన పంటల ద్వారా రైతుల ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక



ఎంపికైన హాకీ బాలుర జట్టు

అనంతపురం కార్పొరేషన్: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను మంగళవారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ ఉభయ జిల్లాల కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాలరెడ్డి, సంజీవరాయుడు, రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, లతాదేవి, ఓబులేసు, నాగరాజు, రాగేష్‌బాబు, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు. ఎంపికైన బాలుర హాకీ జట్టులో మహ్మద్ జునైద్, గోవర్ధన్, శశికుమార్, లవన్‌కుమార్ నాయక్, అభిషేక్, శబరీష్, స్వామి, జిలాన్, కుమారస్వామి, మహేష్, సుధీర్, రామ్‌చరణ్, అక్షయ్‌కుమార్, ఖాదర్‌బాషా, విష్ణువర్ధన్, సుధీర్, సుధీర్‌రెడ్డి, అరవింద్ ఉన్నారు. అలాగే బాలిక జట్టులో శివగంగ, భావన, అరిఫా, అక్షయ, సాయివింధ్యశ్రీ, శ్రీచైతన్య, భవ్య, వీక్షిత, బేబి, జయశ్రీ, ఆసిన్, తేజశ్రీ, షాను, అంకిత, లక్ష్మన్, రామతులసి, సుమతల, స్వాతి చోటు దక్కించుకున్నారు. బేస్‌బాల్ బాలుర జట్టుకు ఫర్మాన్, సాయివర్ధన్, కిషోర్, అర్జున్ నాయక్, రాజశేఖర్, షేక్ మహ్మద్, యోగేష్, గురునాథ్, జయవర్ధన్ నాయక్, హర్షిత్, భరత్‌కుమార్, రాఘవేంద్ర, మణికంఠ, గౌతమ్ గంభీర్, హరీష్, రాజేష్, బాలిక జట్టుకు అఫ్రీన్ భాను, దేవయాని, దివ్య, వైష్ణవి, మోక్షిత, కీర్తన, లక్ష్మి, రశ్మిత, సురేఖ, గుల్షన్, వనిత, మనీషా, హారిక, హర్షిత, ప్రసన్న, భార్గవి ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్ బాలికల జట్టులో అమ్ము, ప్రవసి, భార్గవి, ఓం శాంతి, వైష్ణవి, అక్షిత, యక్షిత, నాగేశ్వరి, ఆశాబేగం, గౌతమి, తులసి, దివ్యశ్రీ, దీక్షిత, వేణువైష్ణవి, చంద్రకళ, శశితేజ, బాలుర జట్టులో శివశంకర్ రెడ్డి, సురేష్, మనోజ్‌కుమార్, మురళి, ముఖేష్, హర్షవర్ధన్, సిద్దిక్ బాషా, షాకీర్‌బాషా, మహ్మద్ శుభం, కార్తీక్, కుశాల్‌సాయి, మంతేష్, లక్ష్మీపతి, శంకర్ సూర్య, నరసింహ, షెక్షావలి చోటు దక్కించుకున్నారు.

నాడు గగ్గోలు.. నేడు గప్‌చుప్

- చంద్రబాబు అవకాశ వాద రాజకీయాలకు పరాకాష్ట
- రాయలసీమ జిల్లాల్లో అడుగు పెట్టడానికి ప్రధాని మోదీ అనర్హుడు
- ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 'గో బ్యాక్ మోదీ' అంటూ నినాదాలు



అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన చంద్రబాబు... నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపడం లేదంటూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో మంగళవారం జెడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న సీఎం చంద్రబాబు ఏపీకి ప్రత్యేక హోదా సాధించడంలో ప్రధానిపై ఎందుకు ఒత్తిడి తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. కనీసం వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ సాధించడంలోనూ చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారన్నారు. కడప ఉక్కు పరిశ్రమ కూడా శంకుస్థాపనలకే పరిమితం కావడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ.. గతంలో ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్య నాయుడు.. తిరుపతి వెంకన్న సాక్షిగా.. ఏపీకి ఐదేళ్లు కాదు పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అప్పట్లోనే చంద్రబాబు సైతం పదేళ్లు కాదు.. ఏకంగా పదిహేనేళ్లు ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగారని, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన తరువాతనే మోదీని ఏపీలో అడుగుపెట్టనిస్తామన్నారు. లేదంటే మోదీ పర్యటనను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహ, వెంకట్ నాయక్, వంశీ, మంజునాథ్, ఉమామహేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



మొక్కజొన్న పంట కాలిపోయిన దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లిలో మహిళా రైతు హనుమక్క తనకున్న మూడు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం పూర్తిగా కాలిపోయింది. తోటలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పడడంతో మొత్తం మంటలు వ్యాపించాయి. రెండు ఎకరాల్లోని పంటతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయింది. కాలిపోయిన పంటను స్థానిక వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. నష్ట నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

25 లోపు పంట నమోదు పూర్తి కావాలి : డీఏఓ

బుక్కరాయసముద్రం: జిల్లా వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటలను ఈ నెల 25వ తేదీలో ఈ–క్రాప్ నమోదు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. బీకేఎస్, గోవిందపల్లి పంచాయతీలో సాగులో ఉన్న పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదైన పంట నష్టపోతే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు తప్పని సరిగా ఈ–క్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్యాంసుందరరెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లు ఇర్ఫాన్, విజయశాంతి, తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేయండి

- ధర్నాలో యుఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ రుష్యేంద్రబాబు



కొటక్ బ్యాంకు ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న రుష్యేంద్రబాబు

అనంతపురం అగ్రికల్చర్: ప్రైవేట్ బ్యాంకులను వెంటనే జాతీయం చేయాలని ఆల్ ఇండియా ప్రైవేట్ సెక్టార్ బ్యాంకు యూనియన్ (యుఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ డి.రుష్యేంద్రబాబు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని సాయినగర్‌లో ఉన్న కొటక్ బ్యాంకు ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రుష్యేంద్రబాబు మాట్లాడారు. ప్రైవేట్ బ్యాంకు యాజమాన్యాలు ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న దమననీతిని ఎండగట్టారు. వీటిని జాతీయకరణ చేయడంతో పాటు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకులో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఉద్యోగులపై విధించిన క్రమశిక్షణా చర్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే క్యాథలిక్ సిరియన్ బ్యాంకుకు వేతన సవరణ అమలు చేయాలని, నైనిటాల్ బ్యాంకు మూసివేతను ఆపాలని, తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు ఉద్యోగుల వయోపరిమితి 60 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉద్యోగ సంఘాల నాయకులు రఘునాథరెడ్డి, శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శివానందగుప్తా, శంకర్, భారతి, మున్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న స్కూల్ సిబ్బంది

అనంతపురం రూరల్: ఈ నెల 11న చీరాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ కనబరచిన ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి విష్ణువర్దన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంతో మంగళవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి సకాలంలో అధికారులంతా హాజరై తమ ప్రగతి నివేదికలను తెలియజేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాప్తాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13న తేదీ జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఖోఖో పోటీల్లో టీ.నందకిషోర్, డి.పూర్ణచంద్, ఎస్.దేవేంద్ర, హ్యాండ్‌బాల్ పోటీల్లో టీ.లోకేష్, ఎస్.వర్ధన్, టీ.లోహిత్‌రాజ్ ప్రతిభ చూపారని పాఠశాల పీడీ రాజశేఖర్‌రెడ్డి, ఖోఖో కోచ్ చిత్రా ఆదినారాయణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించారు.

యువకుడి అదృశ్యం



మల్లికార్జున

అనంతపురం సెంట్రల్: నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో నివాసముంటున్న మల్లికార్జున అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఆర్ట్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న మల్లికార్జున ఎప్పటిలాగే ఈ నెల 4వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికారు. బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.

'సురక్ష' యాప్ ద్వారానే మద్యం విక్రయాలు

అనంతపురం సెంట్రల్: నకిలీ మద్యం నిర్మూలనకు కఠిన చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే మద్యం అమ్మకాలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. సులువుగా మద్యం నాణ్యతను కనుక్కునే విధంగా ఈ యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. ప్రతి మద్యం షాపు, బార్ లైసెన్స్‌దారుడు ఎక్సైజ్ సురక్షయాప్ ద్వారానే మద్యం విక్రయాలు చేయాలని ఆదేశించారు. వినియోగదారులు కూడా ఎలాంటి అనుమానాలున్నా యాప్ ద్వారా నివృత్తి చేసుకోవాలని కోరారు.

'చలో ఢిల్లీ'కి తరలిరండి

అనంతపురం సిటీ: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ నవంబర్ 24న నిర్వహించతలపెట్టిన చలో ఢిల్లీకి తరలిరావాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మంగళవారం పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ఇప్పటికే చర్చించినట్లు తెలిపారు.

సర్వజనాస్పత్రిలో స్వచ్ఛతేదీ?

- కంపు కొడుతున్న వార్డులు
- ఎక్కడ పడితే అక్కడ బయోవేస్ట్
- రోగులకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం



ఆస్పత్రిలో వ్యర్థాలను సంచిలో తీసుకెళ్తున్న సిబ్బంది



అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో డస్ట్‌బిన్ పరిస్థితి..





గైనిక్ వార్డులో రోగుల వద్దే కవర్లు లేని డస్ట్‌బిన్, ఆస్పత్రి వెనుక కంపోస్టులో గుట్టగా పడేసిన వ్యర్థాలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్వచ్ఛత కనుమరుగైంది. అపరిశుభ్రతతో వార్డులు కంపు కొడుతున్నాయి. వైద్యం కోసం వచ్చే వారు స్వస్థత మాట అటుంచితే మాయరోగాలు తెచ్చుకునే పరిస్థితులు కలవర పెడుతున్నాయి. నూతన శానిటేషన్ ఏజెన్సీ వారు వార్డుల్లో డస్ట్‌బిన్లు, కవర్లను కూడా సరఫరా చేయకపోవడంతో బయోవేస్ట్‌ను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసే పరిస్థితి కన్పించడం లేదు. ఇన్ఫెక్షన్ల ద్వారా రోగులకు ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆస్పత్రిలోని కొందరూ సీనియర్ వైద్యులు చెబుతున్నారు.

డస్ట్‌బిన్‌లు, కవర్లు లేని వైనం

వార్డుల్లో డస్ట్‌బిన్‌ల ద్వారా సేకరించిన చెత్తను కవర్లలో మూటకట్టి ఆస్పత్రి వెనుక ఉన్న కంపోస్టు వద్ద ఉంచాలి. కానీ కవర్లు సరఫరా చేయకపోవడంతో బయోవేస్టేజీని ఎక్కడ పడితే అక్కడ వదిలేశారు. క్యాజువాలిటీ, ఏఎంసీ, ఐసీసీయూ, మెడిసిన్, సర్జరీ, గైనిక్, ఈఎన్‌టీ, ఆర్థో, సైకియాట్రీ, పల్మనాలజీ విభాగాలతో పాటు ఆపరేషన్ థియేటర్లలో కచ్చితంగా నాలుగు రకాల పసుపు, రెడ్, బ్లూ, వైట్ కంటైనర్లను ఉంచాలి. పసుపు డబ్బాలో రోగులకు వినియోగించిన డస్ట్‌బిన్, డ్రెస్సింగ్ వేస్టేజీలు, గాజు గుడ్డ, డైపర్లు, శరీరద్రవాలు, శరీర భాగాలు, ప్లసెంటా (మాయ), శరీర అవయవాలు, మానవ కణజాలలు, సూక్ష్మక్రిమి వ్యర్థాలు, నెత్తురు, చీము, బ్లడ్ బ్యాగులు, గడువు ముగిసిన మందులు వేయాలి. రెడ్‌డబ్బాలో గ్లవ్స్, ప్లాస్టిక్ పార్టికల్స్, ఐవీ సెట్, క్యాథటర్స్, మూత్రం సంచులు వేయాలి. బ్లూ డస్ట్‌బిన్‌లో గాజు సీసాలు, వయల్స్, ఏంప్యూల్స్, ఇంప్లాంట్లు, పంచర్‌ప్రూఫ్ కంటైనర్‌లో సూదులు, సిరంజీలు, నీడిల్ కట్టర్‌తో కత్తిరించిన సూదులు, బ్లేడులు, విరిగిన గాజు, పగిలిన స్లైడ్స్, నెయిల్స్, లాన్‌సెట్స్, తదితర వాటిని ఉంచుతారు. కానీ వార్డుల్లో డస్ట్‌బిన్లను కూడా ఏర్పాటు చేయని దారుణమైన పరిస్థితి నెలకొంది.

బయోవేస్టేజీతో ప్రమాదం

పసుపు డబ్బాలో వేసే వ్యర్థాలను అతి జాగ్రత్తగా తీసుకెళ్లాలి. సురక్షిత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తే ఆస్పత్రిలోని వివిధ వార్డుల్లో ఇన్ఫెక్షన్లు సోకుతాయి. తద్వారా రోగులతో పాటు వైద్యులు, స్టాఫ్‌నర్సులు, శానిటేషన్ సిబ్బంది, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, తదితరుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. హెచ్‌బీఏ1సీ, హెచ్‌ఐవీ, తదితర ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇక సర్జరీలు వికటించి రోగులకు ఇన్ఫెక్షన్లతో దీర్ఘకాలికంగా ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది.

పర్యవేక్షకుని నిర్లక్ష్యం..

సర్వజనాస్పత్రిలోని వార్డులను ఎప్పటికప్పుడు పర్యవేక్షకుడు పర్యవేక్షించాలి. కానీ ఆయన తన చాంబర్ వరకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. ఇదే అదునుగా నూతన శానిటేషన్ నిర్వాహకులు వారి ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శానిటేషన్‌ను మెరుగుపరచాలని రోగులు కోరుతున్నారు.

సర్వజనాస్పత్రిలో వైద్య సేవలు..	
రోజువారీ ఓపీ సంఖ్య	2,500
ఐపీ	1300
శానిటేషన్ ఖర్చు నెలకు	రూ.70 లక్షలు

మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోతే చర్యలు



ఏపీ మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల పరిశుభ్రత, డ్రింకింగ్ వాటర్ టెస్టింగ్‌ను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేద విద్యార్థులేనని, వారికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, లేకపోతే పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. అలాగే మరుగుదొడ్లను పరిశుభ్రతగా ఉంచుకోవాలన్నారు. డ్రింకింగ్ వాటర్ శాంపిల్స్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఎంఈఓ మల్లికార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ దేవికారాణి, సరస్వతి పాల్గొన్నారు.

ఈనాం భూములపై సమగ్ర విచారణ చేయాలి



కబ్జాకు గురైన భూములను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు రాంభూపాల్, నల్లప్ప తదితరులు

రాప్తాడు రూరల్: పాపంపేట ఈనాం భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం అనంతపురం రూరల్ మండలం పాపంపేట గ్రామంలోని ఈనాం భూములను పరిశీలించింది. బృందంలో రాంభూపాల్‌తో పాటు జిల్లా కార్యదర్శి నల్లప్ప, నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్వీ నాయుడు, నగర కమిటీ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, బుల్లె రాజు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు రామాంజనేయులు ఉన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పాపంపేట గ్రామ ప్రజలు, భూమి యజమానులు, ఈనాం భూములపై జరుగుతున్న ఆక్రమణలు, వస్తున్న వార్తలు, భయకంపితులను చేస్తున్నాయన్నారు. పాపంపేట గ్రామం చరిత్ర పరంగా వ్యక్తిగత ఈనాం భూమిగా మంజూరైందన్నారు. సెటిల్‌మెంట్ ప్రక్రియలో రాచూరు వెంకటరమణ శాస్త్రి, రాచూరు సుబ్రహ్మణ్య శాస్త్రికి ఎలాంటి రైత్వారీ హక్కులు, పట్టాలు మంజూరు చేయలేదన్నారు. వారి వారసులకు ఈ భూములపై ఎలాంటి చట్టబద్ధ హక్కులూ లేవన్నారు. 80 సంవత్సరాలుగా దాదాపు 15 వేల మంది స్థిర నివాసం ఏర్పరచుకున్నారన్నారు. కొందరు 296 ఎకరాలలో తమకు హక్కులు ఉన్నాయన్న పేరుతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ కష్టార్జితంతో కట్టుకున్న ఇళ్లను తొలగిస్తారనే భయాలు ఈ ప్రాంత వాసులకు ఉన్నాయన్నారు. వారికి భయం తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్‌ఎస్‌బీఎన్‌కు పూర్వవిద్యార్థుల విరాళం



చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం సిటీ: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ విద్యా సంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు భూరి విరాళం ప్రకటించారు. ప్రముఖ న్యాయవాది దివంగత జీసీ రామప్ప, జీసీ రంగమ్మల జ్ఞాపకార్థం వారి వారసులు రూ.12 లక్షలను అనంతపురం డిస్ట్రిక్ట్ నేషనల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులకు చెక్కు రూపంలో మంగళవారం అందజేశారు. పైన పేర్కొన్న దంపతులకు తొమ్మిది మంది సంతానం కాగా, వారందరూ సాయిబాబా విద్యా సంస్థల్లోనే చదువుకున్నారు. వారిలోనూ దివంగతులైన జీసీ బాబా ప్రసాద్, జీసీ భారతి, జీసీ రాజగోపాల్, జీసీ రాధాకృష్ణ, జీసీఆర్ వెంకటేశ్ చౌదరి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులైన జీసీ జయశీలరావు రూ.10 లక్షలు, జీసీ విజయ రాఘవన్, జీసీ భాగ్యమ్మ చెరో రూ.లక్ష చొప్పున మొత్తం రూ.12 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే వడ్డీని టెన్త్, ఇంటర్, డిగ్రీలో అత్యున్నత ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అందజేయాల్సిందిగా దాతలు కోరారు. ట్రస్ట్ నిర్వాహకులు పీవీ రమణారెడ్డి, పరుచూరి రమేశ్‌బాబు, కె.నిర్మలమ్మ, పీఎల్ఎస్ రెడ్డి, సుంకు వేణుగోపాల్, కె.అన్నపూర్ణ, ట్రస్ట్ సభ్యులు పీఎం వేణుగోపాల్, కె.పద్మనాభరెడ్డి దాతలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌బీఎన్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పరుచూరి రమేశ్‌బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు విరాళాల రూపంలో రూ.25 లక్షలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.సి.సరిత, అధ్యాపకులు మురళీమోహన్‌రెడ్డి, డా.నాగేంద్రవరప్రసాద్, మహేశ్, విశ్వనాథ్, పద్మావతి పాల్గొన్నారు.

ఎన్‌జీఓ సభ్యత్వ నమోదు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ఏపీ ఎన్‌జీఓ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌జీఓ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ, ఉద్యోగుల సంఘం నాయకులు రమణారెడ్డి, పద్మావతి, రాజగోపాల్, వీరేష్, సల్మా, హఫీజ్, శ్రీనివాసులు, ఏఓ మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బీమా ఏజెంట్ కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సిటీ: తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్‌గా పని చేసేందుకు ఆసక్తి గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ మంగళవారం తెలిపారు. దరఖాస్తులను అనంతపురంలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం సహా అన్ని తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. పదో తరగతి పాసైన వారు, అంతకంటే ఎక్కువ చదివిన వారు 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఉత్సాహవంతులైన వారు తమ బయోడేటా, వయస్సు, విద్యార్హతకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 21లోగా అనంతపురంలోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జ్ఞానజ్యోతులే దీపావళి వెలుగులు

అనంతపురం కల్చరల్: దీపావళి వెలుగులంటే జ్ఞానజ్యోతులేనని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. మంగళవారం ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో అశోక్‌నగర్, సంఘమేష్‌నగర్ తదితర చోట్ల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత భగవద్గీతపై సాధకులు, ప్రచారకులు మాట్లాడారు. దీపావళి పండుగను సందడిగా కాకుండా జ్ఞానమార్గంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక ప్రచార కార్యక్రమంలో నీలావతి, నరేష్‌కుమార్, నాగమణి, లక్ష్మీదేవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న మహమ్మద్ అబ్దుల్లా

అనంతపురం రూరల్: ముస్లింల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ధ్వజమెత్తారు. మంగళవారం నగరంలోని రేడియం ఫంక్షన్ హాలులో 'ప్రస్తుత రాజకీయ పరిణామాలు – మైనార్టీల కర్తవ్యం' అనే అంశంపై ఆవాజ్ జిల్లా కార్యదర్శి వలి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తన మతోన్మాద ఎజెండాను అమలు చేయడంలో ఎక్కడా తగ్గడం లేదన్నారు.. దేశ వ్యాప్తంగా మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న తీరుకు వ్యతిరేకంగా లౌకిక శక్తులు ఏకమై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అడ్డు పెట్టుకొని బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. సనాతన ధర్మం, హైందవ శంకారావం, తిరుపతి లడ్డూ వంటి విషయాల్లో హిందువులను రెచ్చగొట్టడంలో బీజేపీ విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామిరెడ్డి, ఆవాజ్ నగర అధ్యక్షుడు మసూద్, కమిటీ సభ్యులు ఇర్ఫాన్, గఫూర్, ఇస్మాయిల్, హాజీ పాల్గొన్నారు.

'మన డబ్బులు- మన లెక్కలు'పై అవగాహన

అనంతపురం టౌన్: మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులకు వారి పొదుపు, అప్పులపై సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు అవకతవకలను అరికట్టి పారదర్శకతను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మన డబ్బులు – మన లెక్కలు యాప్‌ను తీసుకొచ్చినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు దశల వారీగా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే పలు సంఘాల సభ్యులకు మన డబ్బులు – మన లెక్కలపై అవగాహన కల్పించామన్నారు. మిగిలిన సంఘాలకు సైతం డిసెంబర్ ఆఖరులోపు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి యాప్ ద్వారానే ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకునే విధంగా ఏపీఎంలు, సీసీలు అవగాహన కల్పించాలని సూచించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి

అనంతపురం రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి తెలిపారు. మంగళవారం అనంతపురం నగరంలోని నాయక్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాలు, పండ్లు ఆకుకూరలు, కోడిగుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ అనురాధ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అర్బన్: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయడంతో పాటు వారిని క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి వారు చేపట్టిన సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందని ప్రకటించారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పీసెట్, మీటర్ రీడర్లు, నాన్ రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యంతో పలుమార్లు చర్చలు, వినతిపత్రాలు, ధర్నాలు చేశారన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఏపీ పవర్ జేఏసీ, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీలు బుధవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ పూర్తి మద్దతు తెలియజేస్తోందన్నారు.

శ్రీదేవికి ఎస్కేయూ డాక్టరేట్



అనంతపురం: ఫిజిక్స్ విభాగంలో పరిశోధన చేసిన ఎం.శ్రీదేవికి ఎస్కేయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.తిమ్మయ్య పర్యవేక్షణలో 'స్ట్రక్చరల్, మార్ఫలాజికల్ అండ్ థర్మల్ అనాలసిస్ ఆఫ్ సర్టైన్ నానో పాలిమర్ ఫిల్మ్స్ సింథసైజ్డ్ బై సొల్యూషన్ క్యాస్టింగ్ టెక్నిక్స్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా శ్రీదేవికి పలువురు అభినందనలు తెలిపారు.

మందకొడిగా సాగుతున్న ఈ-క్రాప్‌పై ఆగ్రహం

అనంతపురం అగ్రికల్చర్: మందకొడిగా సాగుతున్న ఈ-క్రాప్ ప్రక్రియపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి (జేడీఏ) ఉమామహేశ్వరమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై మంగళవారం ఏడీఏ, ఏఓ, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 25తో ఈ-క్రాప్ గడువు ముగుస్తుందని, ఇప్పటి వరకు 56 శాతం మాత్రమే పూర్తి కావడంపై ఏఓలు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్ల పనితీరుపై మండిపడ్డారు. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ పంటలకు సంబంధించి ఈ ఖరీఫ్‌లో 19,10,109 ఎకరాల్లో సాగులోకి వచ్చినట్లు చెబుతుండగా... అందులో ఈ-క్రాప్ కింద 10,71,802 ఎకరాలు మాత్రమే నమోదు చేయడాన్ని తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులు, అసిస్టెంట్లను వివరణ కోరారు. గడువులోపు పూర్తి చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే..



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ హెచ్ సుదర్శనరావు

అనంతపురం: అధ్యాపకులూ నిత్య విద్యార్థులేనని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ హెచ్.సుదర్శనరావు అన్నారు. అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్ క్యూకలెక్టై ఓయాసిస్, జేఎన్‌టీయూ అనంతపురం సంయుక్తంగా రెండు రోజులు పాటు అధ్యాపకులకు భావి నైపుణ్య శిక్షణ (అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్) నిర్వహిస్తున్నారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. క్వాంటం టెక్నాలజీలో ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు పరిపూర్ణమైన అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తొలి రోజు క్వాంటం టెక్నాలజీ అంశాలపై సీ-డాక్ ప్రాజెక్ట్ ఇంజినీర్ డాక్టర్ దివ్యాన్స్ శ్రీనాలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇంకుబేషన్ సెంటర్ డైరెక్టర్ సి. శోభాబిందు పాల్గొన్నారు.

"పఠనాభిరుచి కేవలం ఆహ్లాదానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, అభిజ్ఞా వ్యాయామం (కాగ్నిటివ్ ఎక్సర్‌సైజ్) అని శాస్త్రీయ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. 'పుస్తక పఠనం అనేది మెదడులో ఇన్‌ఫర్‌మేషన్ ప్రాసెసింగ్‌కు సంబంధించి కొత్త మార్గాలను సృష్టిస్తుంది' అంటున్నారు డెవలప్‌మెంటల్ సైకాలజీ అండ్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ గ్రెగోయిర్."





ప్రతీకాత్మక చిత్రం

వద్దిక... ఓవర్ ఒద్దిక బెటర్!

పేరెంటింగ్‌పై చర్చ

ఇది వైరల్ కాలం! సర్వైలెన్స్ కెమెరాల మధ్య బిగ్ బాస్ హౌస్ ఉన్నట్టే జెన్ ఆల్ఫా కూడా తమను సోషల్ మీడియా ఫ్రేమ్‌లో ఫిక్స్ చేసుకుంది! అందుకే వాళ్లు ఎక్కువగా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను, వాళ్లు చూస్తున్న రీల్స్, షార్ట్స్, షోస్‌లోని క్యారెక్టర్స్‌ను అనుకరిస్తుంటారు. ఈ తీరు కొందరికి అతిగా... అసహజంగా అమర్యాదగా తోచవచ్చు. ఇంకొందరికి ముచ్చటగా అనిపించవచ్చు. ఈ రెండిటికీ ఉదాహరణగా ఇటీవల వైరల్ అయిన కౌన్ బనేగా కరోడ్‌పతి 17 వ సీజన్ 'కేబీసీ జూనియర్స్' లో ఓ చిన్నారి పార్టిసిపెంట్ వీడియోను చూపిస్తున్నారు. దీనిపై కామెంట్లు, కాంప్లిమెంట్లను పక్కన పెడితే ఈ వీడియో.. జెన్ ఆల్ఫా పేరెంటింగ్ కి సంబంధించి ఓ చర్చను లేవనెత్తింది...

కేబీసీలో ఇదీ జరిగింది..

కౌన్ బనేగా కరోడ్‌పతి17వ సీజన్‌లోని 'కేబీసీ జూనియర్స్' హాట్ సీట్‌లో ఓ బుడతడు కూచున్నాడు. చుట్టూ కెమెరాలు.. ఆడియెన్స్.. ఎదురుగా 83 ఏళ్ల పాపులర్ పర్సనాలిటీ.. ఎవర్‌గ్రీన్ సెలబ్రిటీ అమితాబ్ బచ్చన్.. అయినా ఎలాంటి బెరుకు లేకుండా చాలా రిలాక్స్‌డ్‌గా.. ఇంకా చెప్పాలంటే ఆ కూర్చోవడంలోనే అందరి అటెన్షన్‌ను గ్రాబ్ చేశాడా పిల్లాడు. వాడి ఆత్మవిశ్వాసానికి ముచ్చటపడుతూ అమితాబ్ 'హాట్ సీట్‌లో కూర్చోవడం ఎలా ఉంది?' అనడిగారు. 'ఎక్సయిటెడ్‌గా ఉన్నాను కానీ.. మీరు రూల్స్ చెబుతూ కూర్చోకండి.. నాకు ఈ షో రూల్స్ అన్నీ తెలుసు.. నేరుగా పాయింట్‌కి వచ్చేద్దాం' అన్నాడు. ఆ జవాబు హోస్ట్ అయిన అమితాబ్‌ను ఖంగుతినేలా చేసింది. అయినా తమాయించుకుని షోని ప్రొసీడ్ చేశాడు. మొదటి ప్రశ్న అడిగి ఆప్షన్స్ ఇచ్చేలోపే జవాబు చెప్పి ఆప్షన్స్ లేకుండానే నా ఆన్సర్‌ని లాక్ చేసేయ్ డాన్స్.. ఆప్షన్ ఏదైనా ఈ ఆన్సర్ లాక్ చేసెయ్' అన్నాడు అమర్యాదగా. ఆ తర్వాత ప్రశ్న అడిగేముందు ఏదో చెప్పబోతున్న అమితాబ్‌ను'మీరు ప్రశ్న యితే అడగండి ముందు' అన్నాడు అదే ధోరణిని కొనసాగిస్తూ. అదే ప్రవర్తనతో ఆ పిల్లాడు అలా అయిదవ ప్రశ్న దాకా వచ్చాడు. 25 వేలు వచ్చే అయిదవ ప్రశ్న 'వాల్మీకి రామాయణంలోని మొదటి కాండ ఏది?' కి ఆప్షన్స్ అడిగాడు ఆ కుర్రాడు.'బాల కాండ.. అయోధ్య కాండ.. కిష్కింధ కాండ.. యుద్ధ కాండ' అంటూ నాలుగు ఆప్షన్స్‌ను చదివారు అమితాబ్. వెంటనే 'బి.. అయోధ్యకాండ' అని చెబుతూ 'ఒక్కసారి కాదు ఈ ఆన్సర్‌ను నాలుగుసార్లు లాక్ చేయండి' అన్నాడు పిల్లాడు. 'సారీ.. తప్పు చెప్పావ్.. కరెక్ట్ ఆన్సర్ బాలకాండ' అన్నారు అమితాబ్. ఈసారి ఆ పిల్లాడు ఖంగు తిన్నాడు.

ఆ బాబు వయసు పదేళ్లు. అయిదవ తరగతి చదువుతున్నాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉంటాడు. ఆ పిల్లాడు జవాబులు చెబుతూంటే ఆడియెన్స్ గ్యాలరీలో ఉన్న అతని తల్లిదండ్రులు కొడుకువైపు మురిపెంగా.. గర్వంగా చూడసాగారు.

ఈ కార్యక్రమాన్ని వీక్షించిన వాళ్లు సోషల్ మీడియాలో రెండురకాలుగా స్పందించారు. కొందరు 'జ్ఞానం ఒక్కటే ఉంటే సరిపోదు.. కాసింత వినయం, సంస్కారం కూడా ఉండాలి','అది కాన్ఫిడెన్స్ కాదు ఓవర్ కాన్ఫిడెన్స్.. ', 'చదువు కన్నా ముందు పిల్లలకు మర్యాద, మన్నన నేర్పాలి', 'అమ్మో... పిల్లాడు కాదు... మహా ముదురు' అంటూ, ఇంకొందరు 'అయిదు నిమిషాల ఫుటేజ్ చూసి పిల్లాడి బిహేవియర్‌ని జడ్జ్ చేయడమేంటీ?', 'పేరెంట్స్ పిల్లాడికి కాస్త మర్యాదగా నడుచుకోమని చెప్పి ఉంటే బాగుండేది' అంటూ కామెంట్ చేశారు.

బ్రేక్ పడాల్సిన ఫ్లేస్ ఇల్లు...



'ఇలాంటి ప్రవర్తన ఉన్న ట్రెండ్‌ను 6 -13 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా చూస్తాం. ఇది బుద్ధిమాంద్యం లేదా ఏడీహెచ్‌డీ ఏమాత్రం కాదు. డిఫరెంట్‌గా కనిపించాలనే తాపత్రయం, పదిమంది దృష్టిని ఆకర్షించాలన్న లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే డిఫరెంట్ బిహేవియర్‌తో సోషల్ మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేయడమన్న మాట. దీనికి ఇండివిడ్యువలిస్ట్‌గా పెరగడం, ఓవర్ కాన్ఫిడెన్స్.. ఓవర్ ఆటిట్యూడ్ బిహేవియర్ కారణం. వాళ్లు సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్, రీల్స్, షార్ట్స్ లోని క్యారెక్టర్లను అనుకరిస్తూ తమ సహజత్వాన్ని మరచిపోతారు. ఆ ప్రభావంతో అందరూ గౌరవిస్తున్న వాళ్ల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటారు. అందులో భాగమే పెద్దవాళ్లను ఏకవచనంతో సంబోధించడం, అన్నీ తమకే తెలుసన్నట్లుండటం, వయసుకు మించి మాట్లాడటం లాంటివి. ఇలాంటి పిల్లల ప్రవర్తనను చక్కదిద్దక పోగా దాన్ని వాకి తెలివితేటలుగా అభివర్ణిస్తూ ప్రోత్సహిస్తుంటే ఇదిగో ఇలాగే ఓవర్ కాన్ఫిడెంట్‌గా తయారవుతారు. ఈ తీరును మొక్కగా ఉన్నప్పుడే తుంచేయాలి. దీనికి బ్రేక్ పడాల్సిన ఫ్లేస్ ఇల్లు.. బ్రేక్ వేసి ఆ ప్రవర్తనను సరిచేయాల్సిన వాళ్లు తల్లిదండ్రులే.

- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి
కన్సల్టెంట్ చైల్డ్ అండ్ అడల్ట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి...



'ఆ బుడతడి వీడియో చాలా వైరల్ అయింది. వైరల్ అయిన వీడియో కూడా జస్ట్ ఒక టూ త్రీ మినిట్స్ క్లిప్పింగ్ అంతే! దాన్నిబట్టే ఆ పిల్లాడి ప్రవర్తనను, పేరెంటింగ్‌ను జడ్జ్ చేయడం కరెక్ట్ కాదని నా ఉద్దేశం. ట్రోల్ చేయడం కూడా తప్పే. అది పిల్లాడి మీద, అతని తల్లిదండ్రుల మీదా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అయితే.. ఆ పిల్లాడిలో ఇంపల్సివిటీ కనిపిస్తోంది. దాన్ని కంట్రోల్ చేసుకోవాలి. ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి.

- వర్ష వేములు, సైకోథెరపిస్ట్

● భ్రమణ కాంక్ష




రైలుతో... ఆమె చెట్టపట్టాలు


'భారతదేశాన్ని చూడాలంటే రైలులోనే చూడాలి' అంటారు మోనిషా రాజేష్. యు.కె.లో స్థిరపడ్డ ఈ మాజీ జర్నలిస్టు ఇప్పుడు పూర్తిగా 'ట్రావెల్ రైటర్'గా మారారు. ఆశ్చర్యకరంగా ఆమె తన కెరీర్‌కు 'రైలు'ను ఒక ఆధారంగా మలుచుకున్నారు. అంటే పుస్తకాలు అమ్మడవగా వచ్చే డబ్బు ఆమెకు రైలు ద్వారా వస్తున్నట్టే. 'హఠాత్తుగా నాకు ఏమర్థమైందంటే నా పుస్తకాలకు రైలు కంటే మించిన కథానాయకుడు లేడని' అంటారామె నవ్వుతూ. ఆమె తాజా పుస్తకం 'మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్ – అరౌండ్ ద వరల్డ్ బై నైట్ ట్రైన్' మార్కెట్‌లోకి వచ్చింది. ప్రపంచంలోని అనేక దేశాలలో రాత్రి జర్నీల ద్వారా ట్రైన్‌లలో సంచారం చేస్తూ తాను చూసిన ప్రపంచాన్ని పరిచయం చేశారు మోనిషా. ఇప్పటివరకూ 'రైలు' ప్రయాణాల ఆధారంగా ఆమెవి నాలుగు పుస్తకాలు వచ్చాయి.

మొదటిసారి రైలుతో ప్రేమ

మోనిషా తల్లిదండ్రులది చెన్నై. ఇద్దరూ డాక్టర్లు. అయితే యు.కె.లోని నార్‌ఫోక్‌లో స్థిరపడ్డారు. మోనిషా అక్కడే పుట్టి పెరిగింది. ఆమెకు 9 ఏళ్లు ఉన్నప్పుడు తల్లిదండ్రులు రెండేళ్ల పాటు వెనక్కు వచ్చి చెన్నైలో ఉన్నారు కాని ఆ సమయంలో మోనిషాకు దేశం గురించి తెలుసుకునే అవకాశం రాలేదు.

తర్వాత ఆమె చదువు సాగి, జర్నలిస్టుగా మారాక, 2010 లో మరోసారి ఇండియాకు వచ్చారు. 'నా దేశాన్ని చూడాలి అని నేను అనుకున్నప్పుడు విమాన ప్రయాణం బదాయి వద్దనుకున్నాను. రోడ్డు సేఫ్ కాదు. అందుకే రైలు ప్రయాణం ఎంచుకున్నాను. 90 రోజుల పాస్ తీసుకుని రైళ్లలో తిరగడం మొదలైన రెండు నెలల్లోనే నాకు అర్థమైపోయింది భారత దేశంలో రైలు ప్రయాణం అద్భుతమని. అందుకే ఈసారి ఒక ప్లాన్‌తో వచ్చి 80 ట్రైన్లలో తిరిగి 'అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్' పుస్తకం రాశాను. దానికి బోల్డంత పాఠకాదరణ, అవార్డులు లభించాయి. ఆ ఉత్సాహం నన్ను రైలులో ప్రపంచ యాత్ర చేసేలా చేసింది' అని తెలిపారు మోనిషా. ఆమె ఇండియాలో తిరుగుతూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు.. మోనిషా రైలు మార్గం ఉన్న ప్రతి దేశంలో తిరుగుతూ 'అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్' పుస్తకం రాశారు. ఇప్పుడు రాత్రి ప్రయాణాలు ఉన్న రైళ్లలో ప్రయాణించి 'మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్' పుస్తకం రాశారు.





ధన్యమయ్యే ప్రయాణం

'నేను భారతదేశమంతా సెకండ్ క్లాస్ ట్రైన్‌లో తిరిగాను. భారతదేశం అర్థం కావాలంటే ట్రైను ప్రయాణం చేయాలి. అదీగాక మనుషులు విమాన ప్రయాణాలతో విసుగెత్తారు. కోవిడ్ వల్ల లాక్‌డౌన్ వచ్చి ముగిశాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భ్రమణకాంక్ష పెరిగింది. లోకం చూద్దాం అనుకుంటున్నారు. దానికి గొప్ప మార్గం రైలే. యూరప్‌లో 2015 నాటికి రాత్రి ప్రయాణాలు ఉండే స్లీపర్ ట్రైన్‌లు బంద్ చేశారు. ఇప్పుడిప్పుడే అవి తిరిగి మొదలయ్యాయి. స్త్రీలు ఒంటరిగా రాత్రిళ్లు రైలు ప్రయాణాలు చేయడం, జీవితాన్ని ఆస్వాదించడంలో భాగమే' అంటారు మోనిషా.

ప్రకృతి కన్నులు

'టర్కీ నుంచి ఆర్మేనియా వరకూ 26 గంటల పాటు సాగే రైలు ప్రయాణం అద్భుతం. టర్కీ సౌందర్యం మొత్తం అక్కడ చూడొచ్చు. ఇక అత్యుత్తమ రైలు ప్రయాణమంటే నార్వే దేశానికి వెళ్లాలి. అక్కడ రైలు కంపార్ట్‌మెంట్లు ఇల్లంత సౌకర్యంగా ఉంటాయి. భోజనం ఏది కావాలంటే అది దొరుకుతుంది. అదొక్కటే కాదు రాత్రి మూడు గంటలకు రైలు అద్దాల్లో నుంచి సూర్యోదయం చూడొచ్చు. ఇలా మరెక్కడ సాధ్యం?' అంటారు మోనిషా.

● కాస్త సరదాగా

ర్యాంప్‌పై స్వీట్ వాక్



- మోడల్స్: శ్రీ గులాబ్ జామ్ గారు, శ్రీ మోతీచూర్ లడ్డుగారు...

స్వీట్లు లేని దీపావళిని ఊహించలేము. మరి దీపావళిని పురస్కరించుకొని ఫ్యాషన్ షోలో మిఠాయిలు పాల్గొంటే ఎలా ఉంటుంది? స్వీట్లు ఏమిటి? ఫ్యాషన్ షో ఏమిటి అని ఆశ్చర్య పోతున్నారా? ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తలుచుకుంటే ఏదైనా సాధ్యమే కదా! ఒక ఏఐ ఆర్టిస్ట్ దీపావళి స్వీట్స్‌కు మోడల్స్‌గా అందమైన రూపాలను ఇచ్చి ఫ్యాషన్ షోలో పాల్గొనేలా చేశాడు. కాజు కట్లీ వయ్యారపు నడకతో ఫ్యాషన్ షో మొదలవుతుంది. ఆ తరువాత శ్రీయుత మిల్క్ కేక్ గారు, మిస్ బర్ఫీ కుమారి గారు, శ్రీమతి మోతీచూర్ లడ్డుగారు కూడా వస్తారు. చీర ధరించి ర్యాంప్ వాక్ చేసిన సోన్ పాపిడీ గారితో షో ముగుస్తుంది. ఆన్‌లైన్ లో షేర్ చేసిన ఈ ఏఐ జనరేటెడ్ వీడియో నెటిజనులలో నవ్వులు పూయిస్తుంది.

● బై మిస్టేక్

'క్యాన్'తార





ఒక పౌరాణిక సినిమాలో ఏదో సీన్‌లో దూరంగా రైలు వెళుతున్న దృశ్యం, మరో సినిమాలో కరెంట్ తీగలు కనిపించడం గురించి సరదాగా మాట్లాడుకుంటారు.

తాజా విషయానికి వస్తే... 'కాంతార' సినిమాలో ఒక సీన్ వైరల్ అయింది.

కాంతార కథ రాజుల కాలం నాటిది. ఆ కాలంలో వాటర్‌క్యాన్‌లు ఉండే ఛాన్స్ లేదు. అయితే ఈ సినిమాలో విందుభోజనాలకు సంబంధించిన ఒక సీన్‌లో దూరంలో వాటర్ క్యాన్ కనిపిస్తుంది. ఇప్పుడు ఈ మోడ్రన్ ప్లాస్టిక్ క్యాన్ ఇంటర్‌నెట్‌లో టాకింగ్ పాయింట్ అయింది.

'ఆ కాలంలో ప్లాస్టిక్ లేనే లేదు. నిజానికి ప్లాస్టిక్ ఎప్పుడు పుట్టిందంటే, ప్లాస్టిక్ పితామహుడు ఎవరంటే' ఇలాంటి జనరల్ నాలెడ్జ్ విషయాలతో పాటు... 'ఫలానా సినిమాలో ఫలాన పొరపాటును మీరు గమనించారా?'లాంటి విషయాలెన్నో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ఇక ఈ ప్లాస్టిక్ క్యాన్ సీన్‌పై మీమ్స్ సంగతి సరే సరి. 'ఇది బడా బ్లండర్ ఏమీ కాదు. పెద్ద సినిమా అన్నాక చిన్న తప్పులు సహజమే' అని ఒక యూజర్ మూవీ మేకర్స్‌ని సమర్థించాడు.

● లీగల్

మీ మాజీ భార్య భర్తపై మీరు కేసు వేయొచ్చు!

నా భార్య మరొకరితో సంబంధం పెట్టుకొని నా నుంచి విడాకులు తీసుకుంది. విడాకుల కేసులో నేను తనకు ఫలానా వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది అని పేరుతో సహా చెప్పినప్పటికీ, తనకు అలాంటివేమీ లేవని కోర్టును నమ్మించింది. దాంతో నేను పదిలక్షల రూపాయలు భరణంగా చెల్లించవలసి వచ్చింది. మా విడాకులు అయిన 7 నెలలకే తను అదే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తను నా భార్యగా ఉన్నప్పుడు వారు కలిసి తీసుకున్న ఫోటోలు కొన్ని పెళ్లి వీడియోలో పెట్టి ఇంటర్నెట్లో కూడా పెట్టుకున్నారు. నన్ను మానసిక క్షోభకి గురి చేసినందుకు నేను నా మాజీ భార్య ప్రస్తుత భర్తపై కేసు వేయవచ్చా? ఎందుకంటే, ఇటీవలే పేపర్‌లో తైవాన్‌లో భార్య ప్రియుడిపై భర్త కోర్టులో దావా వేయగా కోర్టు అతనికి పరిహారం కూడా చెల్లించమని చెప్పిందని ఒక వార్త చదివాను. మనదేశంలో కూడా అలా చేసే వీలుందా?

- సంపత్, హైదరాబాద్

రెండు వారాల క్రితం ఇలాంటి ఒక కేసు గురించి మన పత్రికలో కూడా సమాధాన రూపంగా చెప్పాను. వివాహేతర సంబంధాలు చట్టరీత్యా నేరాలుగా పరిగణించక పోయినప్పటికీ, సివిల్ దావాలు/పరిహారాలు కోరడానికి భారతీయ చట్టాలలో ఎటువంటి అడ్డంకీ లేదు. మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా, వివాహేతర సంబంధాలు ఇకపై సివిల్ కోర్టుకు చేరే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మీరు మీ మాజీ భార్య ప్రియుడి మీద (ప్రస్తుతం ఆమె భర్త) ఖచ్చితంగా కేసు వేయవచ్చు. పరిహారం కూడా కోరవచ్చు. ఇటీవలే ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో ఒక భార్య తన భర్త ప్రియురాలిపై వేసిన దావా చెల్లుతుంది అని పేర్కొంది. అయితే మీరు కేసు వేసిన తర్వాత, మీ మాజీ భార్యకి, తన భర్తకి సంబంధం ఉండేదనే విషయాన్ని ఖచ్చితమైన సాక్ష్యాధారాలతో రుజువు చేయవలసి ఉంటుంది. కోర్టును ఎవరు ఆశ్రయిస్తే వారే తమ పక్షం వాదనని వాస్తవాలేనని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది! కేవలం గతంలో వారిద్దరూ కలిసి తీసుకున్న కొన్ని ఫొటోల ఆధారంగా మాత్రమే మీరు కేసు గెలవడం కొంత కష్టమే! అయితే, అసలు మీ మాజీ భార్యకు అతనితో పెళ్లికి ముందు పరిచయమే లేదు అతను ఎవరో నాకు తెలియదు'' వంటి సమాధానాలు చెప్పి ఉన్నట్లయితే, మీ డైవర్స్ కేసులో జరిగిన వాదోపవాదాలను ఆధారంగా తీసుకొని మీ తరపు సాక్ష్యాలుగా కూడా కోర్టు ముందు ఉంచవచ్చు. ఇవన్నీ ఒకవేళ రుజువు అయినట్లయితే మీకు మానసిక క్షోభ కలిగించినందుకు గాను, ఆర్థికంగా కూడా మీరు నష్టపోయినందుకు గాను, మీరు తగిన పరిహారం పొందే అవకాశం లేకపోలేదు. మీరు కేసు వేయాలి, తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేయగలను అనుకుంటే, మీ మాజీ భార్యని కూడా కేసులో పార్టీ చేయండి. ఇంతవరకు ఇలాంటి కేసులు లేకపోయినప్పటికీ, ఇటీవలే మన భారతీయ కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా మీ కేసు విచారణకు మాత్రం అర్హత సాధించింది. కేసు గెలవడం ఓడిపోవడం తర్వాత సంగతి. అన్ని సాక్ష్యాధారాలు, ముఖ్యంగా మీ డైవర్స్ కేసులో మీ మాజీ భార్య ఇచ్చిన వాంగ్మూలాలు/ క్రాస్ ఎగ్జామినేషన్‌లో తను చెప్పిన సమాధానాలు వంటివి నిక్షిప్తపరిచి ఒక లాయర్‌ను సంప్రదిస్తే మీకు ఉపశమనం లభించవచ్చు.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది


మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● వైల్డ్ లైఫ్ ఆర్టిస్ట్

వన్యప్రాణులకు కుంచెతో ప్రాణం

కాంక్రీట్ వనాలు పెరిగిపోతున్న నేటిరోజుల్లో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నది తెలిసిందే. ఈ క్రమంలో సెల్ఫ్ ఆర్టిస్ట్‌గా పేరొందిన మీరట్ వాసి దీక్షా చౌహాన్ అడవి జంతువుల జీవన వ్యథను, బతుకు పోరాటాన్ని తన హైపర్ రియలిస్టిక్ చిత్రాలతో మన కళ్లకు కడుతోంది. స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని వదిలి, చిన్నప్పుడు హాబీగా నేర్చుకున్న పెయింటింగ్‌తో దోస్తీ చేసింది. ఏ టేబుల్ మీద అయితే ల్యాప్‌టాప్‌తో సాఫ్ట్‌వేర్ వర్క్ చేసేదో అదే టేబుల్‌ను కాన్వాస్‌గా మార్చుకుంది. ఐదేళ్లుగా తన బ్రష్ స్ట్రోక్స్‌తో అడవి జంతువులకు గొంతుకగా మారిన దీక్ష పెయింటింగ్ కళ దేశ సరిహద్దులను దాటి ప్రపంచ వన్యప్రాణి ప్రేమికులకు చేరువయింది. ఉపాధితో పాటు ఉపయుక్తమైన మార్గాన్ని ఎంచుకున్న దీక్ష నేడు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.





'ఒక కళాకారిణిగా నేను దేనికీ కట్టుబడి లేనట్టు ఎదుటివారికి అనిపిస్తుంది. కానీ, నేను ప్రతి దానితో కనెక్టివ్‌గా ఉన్నాను. దేనికీ దూరం కాలేదు' అని చెబుతుంది 29 ఏళ్ల దీక్ష చౌహాన్. ఐదేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి పెయింట్ బ్రష్ పట్టుకుంది. అందమైన సినరీలు, పోర్ట్రయిట్‌లు పెయింట్ చేస్తూ అడవి జంతువులవైపు దృష్టి సారించింది. ఒక ఉన్నతమైన ప్రయోజనాన్ని కలిగించే మార్గాన్ని అన్వేషిస్తూ అడవి జీవుల వ్యథలను చిత్రీకరిస్తూ, వాటికి గొంతుకలా మారింది.

మూలాలకు చేరుకున్న కళ

దీక్ష పెయింట్ బ్రష్ అందుకోవడానికి ముందు సంగీతం, నృత్యం కళలు ఉన్న ఇంట్లో పెరిగింది. కళ ఒక కాలక్షేపానికి కాదు, అది ప్రపంచాన్ని చూపే ఒక మార్గం అని తెలుసుకుంది. ఇంజినీరింగ్ విద్య డిగ్రీకి కొలమానంగా, ఉపాధిని పొందడానికి ఒక మార్గంగా చూపుతున్నప్పటికీ ఒక చోట తనను తాను బంధించుకోలేనని నిర్ణయించుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా కెరీర్‌ను కొనసాగిస్తున్న ఆమె కళాకారిణిగా వెనక్కి తిరిగి చూసుకుంది. సంతృప్తిగా సాగుతున్న ఈ కళా ప్రయాణం తనను తన మూలాలకు తిరిగి చేర్చిందనుకుంది.

సృజనాత్మకత పరిరక్షణ

దీక్ష వన్యప్రాణుల చిత్రాలు చాలా వాస్తవికంగా ఉంటాయి. ఆ చిత్రాలను చూసేవారు వెంటనే ఉలిక్కిపడతారు. పులి చూపులు మన మీదకు దూకేలా అనిపిస్తాయి. ఖడ్గమృగాన్ని ఒకసారి తాకి చూద్దాం అనుకుంటారు. పక్షులు ఆకాశం మధ్యలో ఆగిపోయినట్లు కనిపిస్తాయి. అయినప్పటికీ అవన్నీ కదలికలతో సజీవంగా ఉంటాయి. దీక్ష చూపే సున్నితమైన సృజన, సాంకేతిక నైపుణ్యంతో మనల్ని జంతువులతో కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. అంతరించిపోతున్న జాతులను రక్షించేందుకు, వాటి ఆవాసాలను సంరక్షించే చొరవకు మద్దతును ఇస్తుంది. దాడికి గురైన మూగప్రాణుల వెతలను కళ్లకు కడుతుంది. ఎన్నో చిత్ర ప్రదర్శనలు, సోషల్ మీడియా, జంతు పరిరక్షకుల సహకారంతో ఆమె తన ప్రతిభను ప్రజలకు చేరవేస్తుంది. మూగజీవాలకు -ప్రజలకు మధ్య వారధిగా తన కళను ఉంచుతుంది. ఆమె కళ జంతుజాలం మనుగడ, దుర్బలత్వం, మనుషుల ప్రమేయం .. ఇలా కథలుగా చూపుతుంది.

ప్రపంచ గుర్తింపు

దీక్ష చేస్తున్న కళా సేవ మన దేశ హద్దులను దాటి ప్రపంచం గమనించేంతగా వెళ్లింది. అన్ని ఖండాలలోని కళారాధకులను చేరుకుంది. కళా సేకరణదారులు, వన్యప్రాణుల రక్షకులు ఆమె సృజనను అర్థం చేసుకున్నారు. జీవ నాణ్యత, మనుగడ, వాటి ఆధారంగా ఉండే లక్ష్యానికి కూడా ఆకర్షితులయ్యారు. ఆమె కాన్వాసులు చాలా మంది చూడని అటవీ ప్రపంచానికి చేరువ చేసింది. స్వరం లేని మూగజీవాలకు తన కళ స్వరం ఇవ్వగలదని దీక్ష నమ్ముతుంది. ఆమె ప్రతి బ్రష్ స్ట్రోక్ ఒక వాదనను వినిపిస్తుంది. ప్రతి పెయింట్ ఒక సందేశాన్ని ఇస్తుంది. ప్రేక్షకులు ఆమె పెయింటింగ్స్ ముందు నిలబడినప్పుడు వారు చిత్రాలను మాత్రమే కాదు దీక్ష కళ్లతో అడవిని వీక్షిస్తున్నారు. అడవి జీవుల కష్టాలను అర్థం చేసుకుంటున్నారు. ఆమె తన స్ట్రోక్స్‌తో మూగజీవాల మనుగడకు పాటు పడేలా చేస్తోంది. ఆమె తన కళ ద్వారా ఉత్కంఠభరితమైన రచనలను కూడా సృష్టిస్తుంది. టాలెంట్‌ను ఇలా కూడా చూపవచ్చు అని ఎంతో మందికి తన కళ ద్వారా రుజువు చేస్తోంది.

బులియన్

బంగారం 10 గ్రా.; వెండి కిలో
అక్టోబర్ 14న ముగింపు రూ.ల్లో

హైదరాబాద్	బంగారం (24 క్యారెట్లు)	1,31,310	బంగారం (22 క్యారెట్లు)	1,18,42	వెండి	1,97,000
విజయవాడ	బంగారం (24 క్యారెట్లు)	1,30,340	బంగారం (22 క్యారెట్లు)	1,17,950	వెండి	1,85,400
విశాఖపట్నం	బంగారం (24 క్యారెట్లు)	1,28,350	బంగారం (22 క్యారెట్లు)	1,17,650	వెండి	2,06,000
రాజమండ్రి	బంగారం (24 క్యారెట్లు)	1,30,840	బంగారం (22 క్యారెట్లు)	1,21,400	వెండి	1,85,400
ప్రొద్దుటూరు	బంగారం (24 క్యారెట్లు)	1,31,000	బంగారం (22 క్యారెట్లు)	1,20,520	వెండి	1,85,000
చెన్నై	బంగారం (24 క్యారెట్లు)	1,29,000	బంగారం (22 క్యారెట్లు)	1,18,250	వెండి	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.